క్లుప్తంగా

పంచాయతీ పురోగతి సూచిక



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీహరి

ఏలూరు(మెట్రో): పంచాయతీ పురోగతి సూచికపై శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీల పురోభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖ అధికారులు అవసరమైన సమగ్ర సమాచారాన్ని సకాలంలో అందించాలని సీఈఓ కోరారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.భీమేశ్వర్, డీపీఓ కె.అనురాధ, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, డ్వామా ఏపీడీ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగి రాజు, ఎంవోటీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బ విద్యుత్ సబ్ స్టేషన్ మెయిన్ బజార్ ఫీడరు, వైఎంహెచ్ఏ హాల్‌లైన్ల మరమత్తుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు సర్కిల్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒన్‌టౌన్‌లోని రిక్షా ఘాటి, ఏడు ఘోరీల సెంటర్, సాంబారు పునుకుల సందు, వేణుగోపాల స్వామి టెంపుల్, విజయలక్ష్మి థియేటర్, బుద్ధ పార్క్, పంట కాలువ రోడ్డు, టీచర్స్ కాలనీ, హెడ్ పోస్ట్ ఆఫీసు ఏరియా, పెరుగుచెట్టు, బిర్లా భవన్ సెంటర్, వైఎంహెచ్ఏ హాల్ ఏరియా, మార్కెట్ ఏరియా పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ మండలానికి చెందిన భార్యాభర్త మధ్య వివాదం నేపథ్యంలో భార్య తీవ్ర మనస్థాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ వివరాలిలా ఉన్నాయి. జాలిపూడి గ్రామానికి చెందిన గౌరీశ్వరి తన భర్త రాజేష్‌తో ఈనెల 4న గొడవపడింది. ఇద్దరి మధ్య వివాదం ముదరి పెద్దదైంది. శనివారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లి ఇంటికి వచ్చింది. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని వేలాడుతూ ఉండగా గమనించిన భర్త రాజేష్ చుట్టుపక్కలవారి సహాయంతో ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ ఘటనపై ఏలూరు జీజీహెచ్ వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి హాస్పిటల్ ప్రాంగణంలోని పోలీస్ ఔట్‌పోస్టు వారికి సమాచారం అందించారు.

వ్యక్తిగత బాధ్యతతోనే సంపూర్ణ పారిశుద్ధ్యం



పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీలత

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకుంటూనే సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యపడుతుందని ఏలూరు రూరల్ ఎంపీడీఓ కె.శ్రీలత అన్నారు. శనివారం జాలిపూడి గ్రామంలో తాగునీటి సరఫరా పారిశుద్ధ్య పనులు అమలు, డస్ట్ బిన్ల వినియోగం, విద్యుత్ సమస్యలపై ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇళ్లకు వెళ్లి యజమానులకు పారిశుద్ధ్యం అమల్లో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని, డస్ట్ బిన్‌ల వాడకం ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

వేతనాలు పెంచాలని వినతి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో పురపాలక సంఘాలు, కార్పొరేషన్‌లలో ఇంజినీరింగ్ పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి వేతనాలు పెంచాలని కోరుతూ శనివారం ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు ఏఐటీయూసీ అనుబంధ దిజోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, కోశాధికారి బి.నారాయణరావు, సహాయ కార్యదర్శి ఎస్ఎంవి సుబ్బారావు, కేవీ రామయ్య, ఈ.ఏలియా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తొలి ఏకాదశి, గురుపౌర్ణమి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు తొలి ఏకాదశి, గురు పౌర్ణమి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల రోజుల్లో నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిద్రావస్థలో నిఘా వ్యవస్థ

- ఎస్పీ శివకిషోర్ లక్ష్యానికి తూట్లు
- డ్రోన్ కెమెరాలు సమకూర్చినా ఫలితం శూన్యం
- ఏలూరు శివారుల్లో అసాంఘిక కార్యకలాపాలపై చర్యలేవీ?



ఏలూరు నగరంలో డ్రోన్ కెమెరా నిఘా (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు, నేరగాళ్ల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక కార్యచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ఏలూరు జిల్లాతోపాటు, నగర పరిసర ప్రాంతాల్లో ప్రతి రోజూ ఏం జరుగుతుందనే అంశాలపై నిఘా పెట్టేందుకు చర్యలు చేపట్టారు. ఎస్పీ శివకిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చొరవతో వ్యాపారవేత్తలు, విద్యా సంస్థల అధినేతలు, దాతలు ముందుకొచ్చి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే డ్రోన్ కెమెరాలను జిల్లా పోలీస్ శాఖకు అందజేశారు. డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ నిత్యం నిఘా నేత్రం పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టిన ఎస్పీ లక్ష్యానికి పోలీస్ సిబ్బంది తూట్లు పొడుస్తున్నారు.

దేగకన్ను ఏమైంది?

ఏలూరు నగరం పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ మద్యం సేవించటం, పేకాట శిబిరాలు, ఏలూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, సాయంత్రం వేళల్లో స్కూల్స్, కాలేజీల వద్ద ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టటం, అసాంఘిక శక్తులపై నిత్యం నిఘా ఉండేలా ఎస్పీ డ్రోన్ కెమెరాల వ్యవస్థను రూపొందించారు. డ్రోన్ కెమెరాలు వచ్చిన కొత్తలో ఏలూరు శివారు ప్రాంతాలైన చొదిమెళ్ల, కొత్తూరు, మాదేపల్లి, తంగెళ్లమూడి, బీడీ కాలనీ, శనివారపుపేట, వట్లూరు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఎగురవేస్తూ నిఘా ఉంచేవారు. ఇటీవల పోలీస్ అధికారులు, సిబ్బంది శివారు ప్రాంతాల్లో ఎక్కడా నిఘా పెట్టిన దాఖలాలు లేవు. జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం నిఘా ఉంచాలని చెప్పినా సిబ్బంది చెవులకు ఎక్కినట్లు లేదు.

తూతూమంత్రంగానే నిఘా

ఎస్పీ కేపీ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధతో శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశారు. శక్తి టీమ్స్ ఆధ్వర్యంలో ఏలూరు నగరంలోని ఆర్ఆర్‌పేట, ఎన్ఆర్‌పేట, ఫైర్‌స్టేషన్ సెంటర్, జూట్‌మిల్లు సెంటర్ ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో డ్రోన్ కెమెరాలతో తూతూ మంత్రంగా పర్యవేక్షణ చేస్తూ పని అయ్యిందంటూ చేతులుదులుపుకుంటున్నారు. స్కూల్స్, కాలేజీలు వదిలే సమయంలో సాయంత్రం 5.30 గంటల నుంచి ఏలూరు నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఏలూరు ఎన్ఆర్‌పేట కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డులో కాలేజీ బస్సులు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా ఏలూరు త్రీటౌన్, ట్రాఫిక్ సిబ్బంది వాహనాలు వెళ్లేందుకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా ప్రభుత్వం మోటారు సైకిళ్లు అందజేసింది. ప్రధాన రహదారుల్లో సైరన్ వేసుకుంటూ తిరగటం మినహా పెద్దగా ఉపయోగం లేదని అభిప్రాయం ప్రజల్లో నెలకొంది.

నేరాలు చేయాలంటే భయపడాలి

జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్



ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడాలంటే భయం ఉండాలని, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా అత్యంత సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమీక్షించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కోర్టు కానిస్టేబుల్స్‌తో ఆయా కేసుల పురోగతిపై సమీక్షించారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, జిల్లాలోని కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది, డీసీఆర్‌బీ సీఐ హబీబ్ బాషా తదితరులు ఉన్నారు.

విద్యాశాఖ నిర్ణయంతో గందరగోళం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యాశాఖలో రాష్ట్ర ఉన్నతాధికారులు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొందని విద్యాశాఖ మంత్రికి ఆప్షనల్ హాలిడేస్, స్థానిక సెలవుల విషయంలో పాఠశాలకు సెలవు ఇవ్వడం కోసం వినతి పత్రం ఇవ్వాల్సిన పరిస్థితి ఏనాడూ కలుగలేదని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ. రామ్మోహన్‌రావు, జి.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆప్షనల్ హాలిడే పాఠశాల మొత్తానికి ఇచ్చే వారిని ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికి 50 శాతం ఉపాధ్యాయులు ఆప్షనల్ హాలిడే వాడుకోవాలని ఉన్నతాధికారులు సూచించడం ద్వారా కొన్ని మతాల ఉపాధ్యాయుల మనోభావాలు మత విశ్వాసాలను దెబ్బ తీసే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయురాలిపై దాడికి ఖండన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ (మాకా) ఉర్దూ హై స్కూల్‌లో ఉపాధ్యాయురాలిపై ఇటీవల జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయురాలిపై అసభ్యకరంగా ప్రవర్తించిన అల్లరి మూకలపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నాయకులు జి.మోహన్, ఎం ఆదినారాయణ, బి.వెంకటేశ్వరరావు, ప్రకాష్‌రావు, ఆర్ రవికుమార్, కేఆర్ పవన్ కుమార్, ఐ.రమేష్ ఈ.రామ్మోహన్, ఎం ప్రవీణ్ కుమార్, బి.రాము ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు సాయం అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చదువుకు పేదరికం అడ్డు కాదని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థీ అభివృద్ధి చెందుతారని స్థానిక శివ అనసూయ విద్యానిధి ఫౌండేషన్ చైర్మన్ మునగాల నాగ వెంకట మురళీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక అమీనాపేటలోని ఫౌండేషన్ హాలులో మునగాల సాయి సుమంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇంటర్మీడియట్ చదువుతున్న 21 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. అతిథులు మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి దాదాపు 340 మంది విద్యార్థులకు మురళీకృష్ణ ఆర్థికంగా చేయూత ఇవ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ కె.ప్రభాకర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాణి, ఆలపాటి నాగేశ్వరావు, కేకే గుప్తా, చామర్తి కృష్ణ, అడుసుమిల్లి నిర్మల, మానేపల్లి సత్యనారాయణ, కడియాల కృష్ణారావు, రత్నాకర్ రావు, మేతర అజయ్ బాబు, మునగాల విజయలక్ష్మి, మునగాల ప్రశాంత్, మునగాల మౌనిక, మానేపల్లి సునీత, ఎం అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా బ్యాంకర్ల వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికలో కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా బ్యాంకర్లు విడుదల చేసిన వార్షిక వ్యవసాయ పంట రుణ ప్రణాళికలో రూ.8,396 కోట్లు రైతులకు పంటలు రుణాలుగా ఇస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. నూటికి 70 శాతం భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని చెప్పారే తప్ప నిర్దిష్టమైన కేటాయింపులు చేయలేదని తెలిపారు. పంటలు సాగు చేయని భూ యజమానులకు పంట రుణాలు మంజూరు చేసిన తర్వాత బ్యాంకర్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. హామీ లేకుండా సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా పంట రుణాలు ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో అమలు కావడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు కొత్త చట్టం తీసుకొస్తామని చెప్పి నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పంట పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని కోరారు. రొయ్యల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వర్జీనియా పొగాకుకు సరాసరి ధర రూ.400 కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు.

మోటార్ ట్రాన్స్‌పోర్ట్ నూతన చట్టాన్ని రద్దు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): మోటార్ ట్రాన్స్‌పోర్ట్ నూతన చట్టాన్ని రద్దు చేయాలని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు రైల్వే గుడ్ షీట్ ఆటో స్టాండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం శనివారం స్టాండ్ ప్రెసిడెంట్ పప్పు మహేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన నూతన మోటార్ ట్రాన్స్‌పోర్ట్ చట్టాన్ని తక్షణం రద్దు చేసి, కార్మికులకు రక్షణ కలిగించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించడం సంతోషమని, ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఆటో కార్మికులకు ఉపాధితో కూడిన సంక్షేమ బోర్డు, రక్షణ కల్పించే చట్టాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆటో కార్మికులపై టాక్స్‌లను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో బుంగ మురళి, రేట్ల పూర్ణచంద్రరావు, సేపాని శ్రీనివాస్, కిలాడి శివ, బోడ గంగాధర్, పళ్ల వెంకటేష్, పిట్ల పెద్దిరాజు, గాడి చిన్ని, పూతి తాలూరి వెంకటేష్, లబ్బీ సత్యనారాయణ, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ కనెక్షన్ల తొలగింపునకు నిర్ణయం



నినాదాలు చేస్తున్న జెడ్పీటీసీ లీలానవకాంతం, పార్టీ నాయకులు

దెందులూరు: కేబుల్ ఆపరేటర్లు ప్రసారాల్లో చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా కేబుల్ కనెక్షన్లు తొలగించుకోనున్నట్లు జెడ్పీటీసీ, సోషల్ వెల్ఫేర్ జెడ్పీ స్థాయి కమిటీ చైర్‌పర్సన్ నిట్టా లీలానవకాంతం అన్నారు. శనివారం జెడ్పీటీసీ కార్యాలయంలో మాల మహాసేన రాష్ట్ర నాయకులు గంటా పండు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు నిట్టా గంగరాజు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లు ట్రాయ్ నిబంధనలు కనుగుణంగా ప్రసారాలు చేయలే తప్ప ఒత్తిళ్లకు తలొగ్గి ఎవరి కోసం సాక్షి ఛానల్ ప్రసారాన్ని నిలుపుదల చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇప్పటికే వినియోగదారులు సాక్షి ఛానల్ ప్రసారాన్ని ఇవ్వనందుకు స్వచ్ఛందంగా కనెక్షన్లు తొలగించుకొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామ శివారు ప్రాంతాల్లో తీర్మానాలు చేస్తారని చెప్పారు. ప్రజల్లో తమకు మద్దతు ఉందని కూటమి ప్రభుత్వం చెబుతూనే కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి పెట్టి సాక్షి ఛానల్ ప్రసారాన్ని నిలుపుదల చేస్తున్నారని ఆరోపించారు.

ఏజెన్సీ విద్యార్థులంటే చులకనా?

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంత విద్యార్థులంటే ప్రభుత్వానికి ఎందుకంత చులకన అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఎస్ఎఫ్ఐ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ తహసీల్దార్ కె.రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆ పాఠశాలలను ఇన్‌చార్జి ఎంఈఓ బాబురావు సందర్శించిక పోవడం బాధాకరమన్నారు.

నివాసాల మధ్యే అడవుల్లా !



బీడీ కాలనీ మెయిన్ రోడ్డులో..



శాంతినగర్ 7వ రోడ్డులో భవంతుల మధ్య..



శాంతినగర్ 2వ రోడ్డులో తుప్పలు



బీడీ కాలనీలో..



భాగ్యనగర్‌లో..



సత్రంపాడులోని..

ఏలూరు నగరంలో పెద్ద పెద్ద భవంతుల పక్కనే అడవులు తలపించేలా పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. స్థలాలు కొనేసి వదిలేయడంతో పిచ్చి మొక్కలు మొలిచి విషసర్పాలకు నిలయంగా మారాయి. అసలే వానాకాలం దోమలతో ఇబ్బందులుపడుతున్న ప్రజలకు మరో సమస్యగా మారాయి ఈ స్థలాలు. కార్పొరేషన్ అధికారులు స్పందించి యజమానులకు నోటీసులిచ్చి వాటిని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ /ఏలూరు

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (టూటౌన్) : ఏలూరు కార్పొరేషన్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తెలిపారు. శనివారం ఉదయం స్థానిక కోట దిబ్బ సర్వీస్ రిజర్వాయర్ వన్ వద్ద ఏఐటీయూసీ అనుబంధ దిజోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ 36వ వ్యవస్థాపక దినోత్సవాన్ని యూనియన్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సిబ్బంది జీతాల పెంపు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎస్ఎన్ఆర్ పెదబాబు, ఈడా చైర్మన్ పి.శివప్రసాద్ మాట్లాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా యూనియన్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, యూనియన్ వ్యవస్థాపకులు చిలుకూరి రమేష్ కుమార్, యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, సహాయ కార్యదర్శి ఎస్ఎంవీ సుబ్బారావు, యూనియన్ నాయకులు పీవీ రమణ, బి.దుర్గాప్రసాద్, షాన్, ఎస్ గౌరీ శంకర్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి రక్షణ సువార్త ఉజ్జీవ మహాసభలు

దెందులూరు: తంగెళ్లమూడి నోవా కాలేజీ రోడ్డు క్రీస్తు ప్రార్థన మందిరంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో రక్షణ సువార్త ఉజ్జీవ మహాసభలు నిర్వహించనున్నట్లు గ్రేస్ పవర్ మినిస్ట్రీస్ సెంట్రల్ చర్చ్ సువార్తికులు కొల్లి మైకేల్ బాబు, మేరీ గ్రేస్ తెలిపారు. శనివారం ఏలూరు రూరల్ మండలం కొమడవోలులో సువార్తికులతో కలిసి రక్షణ సువార్త ఉజ్జీవ మహాసభలపై ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు సాయంత్రం 6 గంటలకు మహాసభలు ఉంటాయని తెలిపారు. ఏలూరుతో పాటు మండలాల్లోని విశ్వాసులు హాజరుకావాలని కోరారు.

ఆర్ఎంపీ సురేష్ అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ వంగాయగూడెం ప్రాంతంలో ఆర్ఎంపీ వైద్యునిగా వృత్తి కొనసాగిస్తున్న వ్యక్తి అదృశ్యమయ్యాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం రాత్రి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వంగాయగూడెంలో నిమ్మనపూడి సురేష్ (42) ఆర్ఎంపీ వైద్యునిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతంలో కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేసేవారు. రెండేళ్ల క్రితం గ్రామంలో ఒక మహిళకు వైద్యం చేయగా మరణించింది. ఆగ్రహానికి గురైన గ్రామస్తులు క్లీనిక్‌ను మూయించివేయగా, అధికారులు జరిమానా విధించారు. అనంతరం సురేష్ ఏలూరు వంగాయగూడెం వచ్చి ఆర్ఎంపీ వైద్యునిగా కొనసాగుతున్నాడు. ఈనెల 3న కళ్లచెరువు గ్రామంలోని తన సోదరుడు పార్థసారధి ప్రసాద్ వద్దకు వెళ్లాడు. అదేరోజు రాత్రి 8.30 గంటల సమయంలో ఏలూరులోని ఇంటికి వచ్చాడు. రాత్రి 10 గంటల సమయంలో సురేష్ అన్న పార్థసారధికి ఫోన్ చేసి కళ్లచెరువులో జరిగిన ఘటన ఎంతో కృంగదీసిందని, జీవితంపై విరక్తి చెందానంటూ చెప్పాడు. మరోసారి రాత్రి 12.30 గంటలకు ఫోన్ చేసి అదే విషయాన్ని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అన్న, బంధువులు ఆందోళనకు గురై సురేష్ కోసం వెదికినా ఆచూకీ లభించలేదు. చివరికి శనివారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

కువైట్‌లో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ థట్ రుయా భాగస్వామ్యంతో కువైట్‌లోని నిర్మాణ రంగంలో నైపుణ్య ఉద్యోగాల కోసం అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ లేదా సీలింగ్ వర్క్స్‌లో ఐటీఐ/డిప్లొమా కలిగి ఉండి, 3 నుంచి 5 సంవత్సరాల అనుభవం ఉన్న 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల పురుష అభ్యర్థుల నుంచి రెండేళ్ల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. నెలకు 200 నుంచి 250 వరకు కువైట్ దీనార్లు (సుమారుగా రూ.56 వేలు నుంచి రూ.70 వేల వరకు) జీతం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఏపీ నైపుణ్యం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, తమ బయోడేటాను స్కిల్ ఇంటర్నేషనల్ డీకి మెయిల్ చేయవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 99888 53335లో సంప్రదించవచ్చన్నారు.

